# శ్రీ సరస్వతి శిశు మందిర్ 45వ వార్షికోత్సవం

**ముఖ్య అతిథిగా హాజరైన బలరాం జాదవ్**

**సంస్కృతి, విలువల నిలయాలు శిశు మందిరాలని ప్రశంస**




**వేల్పుల నగేష్- జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ నలభై ఐదవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మందిరాలు సాంస్కృతిక నిలయాలని, ఇక్కడ చదువుతో పాటు విలువలు నేర్పిస్తారని తెలిపారు. పిల్లలను శారీరక, మానసిక దృఢత్వంతో తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం బలరాంను శాలువాతో సన్మానించింది. ఈ వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బొమ్మ వెంకన్న మహా నాయకుడు

**వైద్యుల అంజన్ కుమార్**

**వర్ధంతి సందర్భంగా దివంగత నేత విగ్రహానికి ఘన నివాళులు**



**కరీంనగర్, మార్చి 18 (జనం పవర్):**

దివంగత నేత బొమ్మ వెంకన్న మహా నాయకుడని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత బొమ్మ వెంకన్న వర్ధంతి సందర్భంగా బొమ్మకల్ లోని మున్నూరు కాపు వసతి గృహంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ మున్నూరు కాపు ముద్దుబిడ్డ, మాజీ శాసనసభ సభ్యులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈ జిల్లాకు, ఈ రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. కార్యకర్తలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు కొరకు పాటుపడిన మహా నాయకుడు బొమ్మ వెంకన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధు, ఇమ్రాన్, ఆసిఫ్, దేవేందర్, శేఖర్ తదితర నాయకులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా సిద్దిపేటలో ఉగాది పంచాంగ ఆవిష్కరణ

**వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వైశ్య భవన్‌లో వేడుకలు**

**తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది పండుగ: నిర్వాహకులు**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

వాసవి క్లబ్ సిద్దిపేట ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వైశ్య భవన్‌లోని వాసవి మాత గుడిలో అత్యంత సంప్రదాయబద్ధంగా జరిగింది. పంచాంగాన్ని ఆవిష్కరించిన అనంతరం కొత్త సంవత్సర ఫలితాలను పండితులు వివరించారు. సమాజంలో శాంతి, అభివృద్ధి, సౌభాగ్యాలు కలగాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**సమాజ సేవా కార్యక్రమాల విస్తరణ**

ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్ మంకాల నవీన్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంకాల శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్, వనిత అధ్యక్షురాలు ఉమారాణి పాల్గొని మాట్లాడారు. ఉగాది పండుగ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పంచాంగం మన జీవన విధానానికి మార్గదర్శకమని వారు పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. వాసవి క్లబ్ ద్వారా పేదలకు, అవసరమైన వారికి సహాయం అందించే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. క్లబ్ సభ్యుల ఐక్యత, సేవాభావం సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సభ్యులు ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొని, కొత్త సంవత్సరంలో మంచి పనులకు శ్రీకారం చుట్టాలని సంకల్పించారు. కార్యక్రమంలో మంకాల నాగరాణి, సోమ వనజ, శివకుమార్, చకిలం రవి, కృష్ణవేణి పాల్గొన్నారు. వీరితో పాటు జోన్ చైర్మన్ మంజుల, జైన సత్యం, అమర్నాథ్, నాగముల కిషన్, వైశ్య భవన్ అధ్యక్షుడు ఐత బాల రాజేశం, పోశెట్టి శ్రీకాంత్, క్లబ్ సెక్రటరీలు, ట్రెజరర్లు తదితరులు హాజరయ్యారు. కొత్త సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సభ్యులు నిర్ణయించారు.



# బస్వాపూర్ లో రంజాన్ తోఫా పంపిణీ

- ముస్లింలకు కానుకలు అందజేసిన సర్పంచ్ లింగం
- మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం అండ



**కోహెడ, మార్చి 18 (జనం పవర్):**

కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 'ఈద్ కా తోఫా' పంపిణీ ఘనంగా జరిగింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మసీదుల ద్వారా అర్హులైన పేద ముస్లిం కుటుంబాలకు ఈ కిట్లను అందజేస్తున్నారు. మండల, గ్రామాల వారీగా పంపిణీ చేయగా.. బస్వాపూర్ గ్రామ సర్పంచ్ బానోత్ లింగం గ్రామ పంచాయతీ వద్ద ముస్లిం కుటుంబాలకు ఈ కానుకలను అందజేశారు.

**ప్రజా పాలనలో సంక్షేమం**

తెలంగాణ వ్యాప్తంగా రంజాన్ పండుగ కానుకగా నిత్యావసర సరుకులు, దుస్తులతో కూడిన కిట్లను ప్రభుత్వం మసీదుల ద్వారా పంపిణీ చేస్తోంది. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో మైనారిటీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ పంపిణీ కొనసాగుతోంది. ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కానుకను అందజేస్తోందని సర్పంచ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ముస్లిం కుల పెద్దలు నసిరుద్దీన్, అబ్దుల్, యాకుబ్, రఫీ, వజీద్ పాషా, ఇక్బాల్ పాషా హాజరయ్యారు. వీరితో పాటు కాజామీయా, కరీముద్దీన్, దులేపాషా తో గ్రామ ప్రజలు ఈ పంపిణీలో పాలుపంచుకున్నారు. పండుగ పూట ప్రభుత్వం తమకు అండగా నిలవడం పట్ల ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# నానో ఎరువుల వాడకంపై అవగాహన

- రసాయన ఎరువుల అధిక వాడకంతో కలిగే నష్టాలపై వివరణ
- పంటలకు ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు



**జుక్కల్, మార్చి 18 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పుల్కల్ రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో రైతులకు నానో ఎరువుల వాడకం, వివిధ పంటల సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. ముందుగా రైతులకు సాంప్రదాయ రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులు వాడుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.

**చీడపీడల నివారణకు సూచనలు**

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పండిస్తున్న వివిధ పంటలకు ఆశించే చీడపీడలు, వాటి లక్షణాలు, అవి నష్టపరిచే విధానాలను రైతులకు వివరించారు. వీటిని నివారించుకునేందుకు పాటించవలసిన సాంప్రదాయ, రసాయన నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలను కాపాడుకుంటూ దిగుబడిని పెంచుకునే మార్గాలను అధికారుల బృందం క్షుణ్ణంగా వెల్లడించింది. రైతులకు మేలు చేసే పలు సూచనలు చేశారు.

**నానో ఎరువుల విశిష్టత**

సమావేశానికి విచ్చేసిన ఇఫ్కో కంపెనీ ప్రతినిధి సతీష్ కుమార్ నానో ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. వీటిని వాడే విధానం, జాగ్రత్తలు, ప్రయోజనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ తుకారం, మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, ఇఫ్కో ప్రతినిధి సతీష్, విస్తరణ అధికారులు దయానంద్, శివలింగ్ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వాసవి మా ఇల్లు ద్వారా ఉచిత మంచినీటి సరఫరా

**గత పన్నెండు ఏళ్లుగా వేసవిలో సాగుతున్న సేవలు**

**మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ చేతుల మీదుగా ప్రారంభం**




**సంగారెడ్డి, మార్చి 19 (జనం పవర్):**

వేసవి కాలం పురస్కరించుకొని వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని 38 వార్డులకు మున్సిపల్ సహకారంతో ఉచితంగా మంజీరా నీటిని అందిస్తున్నారు. గత 12 ఏళ్లుగా బస్తీల వారీగా ఈ నీటి పంపిణీ సాగుతోంది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కూస వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫ్ హఫీజ్ జెండా ఊపి వాటర్ ట్యాంకును ప్రారంభించారు.

**అధికారుల పర్యవేక్షణలో పంపిణీ**

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో ఈ ట్యాంకర్ల ద్వారా సరఫరా సాగుతోంది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ తోపాజి అనంత కృష్ణ, 21వ వార్డు కౌన్సిలర్ వీణా హరీష్, రాధా కిషన్, విద్యాసాగర్, బచ్చిలింగం, మల్లేశం, శివుడు, భాస్కర్, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు. కౌన్సిలర్లు శ్రీశైలం, కిరణ్ కుమార్, రాజు గౌడ్, ప్రసాద్ తో పాటు సుధాకర్, శ్రీహరి తదితరులు హాజరయ్యారు.




# పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ పీ వీ టీకా కార్యక్రమం

**గర్భాశయ క్యాన్సర్ నివారణకు కీలక అడుగు**

**ఆడబిడ్డల ఆరోగ్య రక్షణకు ఎమ్మెల్యే తోట భరోసా**

**జుక్కల్, మార్చి 18 (జనం పవర్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గర్భాశయ క్యాన్సర్ నివారణలో భాగంగా పిట్లం మండల కేంద్రంలో హెచ్ పీ వీ వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆడబిడ్డల ఆరోగ్య రక్షణకు ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. పిట్లం ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొని బాలికలకు టీకాలు అందించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు. చిన్న వయసులోనే టీకాలు వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని నేతలు సూచించారు. పిట్లం మండలానికి చెందిన స్థానిక నాయకులు, సర్పంచులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆడబిడ్డల ఆరోగ్యమే కుటుంబం, సమాజం భవిష్యత్తు అని, హెచ్ పీ వీ టీకాతో సురక్షితమైన రేపటికి బాటలు వేయవచ్చని వారు ఈ సందర్భంగా వెల్లడించారు. బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు.

# నిజాంసాగర్ కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే తోట

**వసతులపై విద్యార్థినులతో ఆత్మీయ సంభాషణ**

**జుక్కల్, మార్చి 18 (జనం పవర్):**

నిజాంసాగర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ బుధవారం సందర్శించారు. పాఠశాల పరిస్థితులను వారు సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థినులతో ముచ్చటిస్తూ వారి విద్యాభివృద్ధి, వసతులు, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థినుల అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థినులకు అవసరమైన తోడ్పాటు అందిస్తామని ఈ సందర్భంగా నేతలు వెల్లడించారు.



# సామాజిక సమస్యలకు నిలయాలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు









- బీజేఆర్ చౌరస్తా, రైతు బజార్ వద్ద పెరుగుతున్న అనుచిత కార్యకలాపాలు
- మహిళలు, వృద్ధుల భద్రతపై సిద్దిపేట వాసుల ఆందోళన

**సిద్దిపేట, మార్చి 18 (జనం పవర్):**

సిద్దిపేట పట్టణంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రస్తుతం సామాజిక సమస్యలకు కేంద్రాలుగా మారుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బీజేఆర్ చౌరస్తా, రైతు బజార్, కోటిలింగాల ఆలయం సమీపంలోని మెదక్ రోడ్డుపై ఉన్న బ్రిడ్జిల వద్ద అనుచిత కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి రోజురోజుకు విషమిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రమాదకర పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### భద్రతా లోపాలతో ప్రయాణికుల భయం

ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు బ్రిడ్జిలను ఉపయోగించడానికి భయపడుతున్నార[ని] స్థానికులు తెలిపారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరిం[త] దారుణంగా ఉంటోందని, భద్రతా లోపాలు తీవ్రం[గా] ఉన్నాయని వారు పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తు[ల] సంచారం ఎక్కువగా ఉండటంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జిలపై వెళ్లేందుకు జంకుతున్నామని, సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### నిఘా పెంచాలని ప్రజల డిమాండ్

మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ తక్షణమే ... తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీస్ పర్యవేక్షణ పెంపు, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలు తీసుకుంటే సమస్యను నియంత్రించవచ్చుని సూచిస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

### వాహనాలు, వ్యవసాయ పనిముట్లపై భారీ రాయితీలు

### ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచన

**వేల్పుల నగేష్- జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో :**



మంచిర్యాల జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పురోగతి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. రవాణా రంగంలో ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం కల్పిస్తారు. లక్ష రూపాయల ధరతో 185 యూనిట్లు కేటాయించారు. ఎలక్ట్రికల్ త్రిచక్ర వాహనాలకు (సరుకు రవాణా, ప్రయాణికుల రవాణా) 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం ఉంటుంది. 3 లక్షల రూపాయల ధరతో 91 యూనిట్లు అందించనున్నారు.

### వ్యవసాయ పథకాలు, రాయితీల వివరాలు

వ్యవసాయ పథకాలలో సోలార్ పంప్ కంట్రోల్, అనుబంధ భాగాలకు 60 శాతం రాయితీ, 40 శాతం బ్యాంకు రుణం ఇస్తారు. వీటి ధర 3 లక్షల నుండి 7 లక్షల రూపాయల వరకు ఉంటుంది. మొత్తం 19 యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1.5 లక్షల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలి. వయసు 21 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాలకు 60 ఏళ్ల వరకు అవకాశం ఉంది. డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాసు పుస్తకం, బోరు బావి ధ్రువీకరణ పత్రం అవసరం. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోగా ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసిన దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకొని సరైన ధ్రువపత్రాలు జత చేయాలి. మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-3ఏ బ్లాక్ లో గల కార్యాలయంలో అందజేయాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుర్గాప్రసాద్ కోరారు. ఈ పథకాలు నిరుద్యోగ యువత ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన తహసిల్దార్



**బెజ్జంకి, మార్చి 18 (జనం పవర్):**

మండల కేంద్రంలోని నర్మదా ఫంక్షన్ హాల్ లో బుధవారం తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసిల్దార్ శ్రీకాంత్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మతసామరస్యానికి ఇఫ్తార్ విందు ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా తహసిల్దార్ పేర్కొన్నారు. అందరూ సోదరభావంతో కలిసిమెలిసి మెలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విందులో పలు గ్రామాల సర్పంచులు బొల్లం శ్రీధర్, బి గుల్ల మోహన్, శానగొండ స్వరూప, గాజా రవళి, జంగిలి లక్ష్మి పాల్గొన్నారు. వీరితో పాటు ఉప సర్పంచ్ దూమాల మహేష్, మహమ్మద్ సాదిక్, పులి రమేష్, సాబుద్దిన్, నిజాముద్దీన్, సమీర్ ఖలీల్ తో పాటు రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విందులో పాలుపంచుకున్నారు.

# ఆస్తి పన్ను వసూళ్ల వెనుకబాటు

- సంగారెడ్డి మున్సిపాలిటీలో 17 కోట్ల లక్ష్యానికి కేవలం 7 కోట్లే వసూలు
- ఆర్థిక సంవత్సరం ముగియడానికి మిగిలింది 13 రోజులే



**సంగారెడ్డి, మార్చి 18 (జనం పవర్):**

సంగారెడ్డి మున్సిపాలిటీకి 2025ఉ26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లు సవాలుగా మారాయి. పట్టణ పరిధిలోని 23,447 గృహాల నుండి మొత్తం 17.17 కోట్ల రూపాయల పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 7.24 కోట్లు మాత్రమే వసూలు కావడంతో లక్ష్యంలో 42.17 శాతం మాత్రమే పూర్తయింది. ఇంకా ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం 13 రోజులు మాత్రమే మిగిలి ఉండగా మిగిలిన 9.93 కోట్ల రూపాయల బకాయిలను వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది మున్సిపల్ అధికారులకు పెద్ద అగ్నిపరీక్షగా మారింది.

### అభివృద్ధి పనులపై పన్నుల ప్రభావం

పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడానికి పౌరుల్లో ఉన్న నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులు, పాత బకాయిలు క్లియర్ చేయకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీ ఆదాయంలో ఆస్తి పన్ను అత్యంత కీలకమైన వనరు. వసూళ్లు తగ్గితే పట్టణంలోని రోడ్లు, కాల్వలు, పారిశుద్ధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ వంటి అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. మున్సిపల్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వసూళ్ల వేగవంతానికి అధికారుల చర్యలు

ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, ఇంటింటికి వెళ్లి వసూళ్లను వేగవంతం చేయడం వంటి చర్యలు ముమ్మరం చేశారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ యంత్రాంగం విజ్ఞప్తి చేస్తోంది. గడువు లోగా పన్నులు చెల్లించి జరిమానాల బారి నుండి తప్పుకోవాలని కోరుతున్నారు. నిధుల కొరత లేకుండా చూడటం అందరి బాధ్యత అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- డాక్టర్ అనిత
- స్కానింగ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్య శాఖ నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు




**వేల్పుల నగేష్- జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత హెచ్చరించారు. బుధవారం నస్పూర్ లో జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 1994 చట్టం ప్రకారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ శిక్షార్హమని, దీనిపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. భేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### నిబంధనల అమలు

స్కానింగ్ కేంద్రాలలో నిబంధనల పుస్తకాలు, రుసుముల వివరాలు గోడలపై ప్రదర్శించాలని ఆదేశించారు. కొత్త యంత్రాల కొనుగోలుకు లేదా పాతవి తొలగించేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులు సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బంగారు పతక విజేత సహస్రకు సన్మానం

### క్రీడల్లో ప్రతిభ చాటిన సంగారెడ్డి క్రీడాకారిణి

### జిల్లా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో అభినందన సభ



**సంగారెడ్డి, మార్చి 18 (జనం పవర్):**

నిర్మల్ జిల్లా భైంసాలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కేలో ఇండియా అస్మిత ఉషా మహిళా రాష్ట్ర స్థాయి క్రీడల్లో నందిగారి సహస్ర అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఈ విజయం ద్వారా జిల్లాకు గుర్తింపు తెచ్చిన సహస్రను జిల్లా వీరశైవ సమాజం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆమె తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు.

### క్రీడల్లో రాణించాలని పిలుపు

ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు, ప్రముఖ న్యాయవాది బసవరాజ్, సలహాదారు చక్రేశ్వర్, అడివప్ప పాల్గొన్నారు. వీరితో పాటు అశోక్, శివకుమార్, నాగేశ్వర్, నియోజకవర్గ అధ్యక్షుడు రేవన సిద్ధప్ప, సంతోష్ కుమార్, సతీష్ కుమార్ హాజరయ్యారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

జనం పవర్
JANAM POWER

గురువారం
19 మార్చ్ 2026

# 29న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**వీరశైవ సమాజం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు**

**మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఇప్పపల్లి నర్సింలు పిలుపు**



**సంగారెడ్డి, మార్చి 18 (జనం పవర్):**

వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఈ నెల 29వ తేదీ ఆదివారం ముహూర్తం ఖరారైంది. సరస్వతి శిశు మందిర్ ఎదురుగా ఉన్న ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుందని జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు తెలిపారు. మహిళల సాధికారతను ప్రోత్సహించడం, సామాజికాభివృద్ధిలో వారి పాత్రను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా మహిళల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు, సత్కారాలు, అవగాహన సదస్సులు ఉండనున్నాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. సమాజంలోని అన్ని వర్గాల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు

**ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ**



**కరీంనగర్, మార్చి 18 (జనం పవర్):**

నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాలులో బుధవారం రాత్రి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నేతలు, మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాలుపంచుకున్నారు. ఎలగందులలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కూడా రాజేందర్ రావు పాల్గొన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి హాజరై వారికి రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండుగను అందరూ సోదరభావంతో ఆనందంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా రాజేందర్ రావు ఆకాంక్షించారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి గళం

**పెండింగ్ పనులు, నిధుల కొరతపై ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే**

**రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని డిమాండ్**



**వేల్పుల నగేష్- జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని పెండింగ్ పనులు, నిధుల కొరత, ప్రజల ఇబ్బందులపై అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని నిలదీశారు. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జి పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎస్టీ సబ్ ప్లాన్ కింద నిధులు వచ్చేవి అని, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. పాత బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు.

## అధ్వాన్నంగా రోడ్లు - ప్రజల అవస్థలు

మంగి, గుండాల, మోడీ గూడ వంటి ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా ఉండటంతో అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లడం ప్రాణసంకటంగా మారిందని ఎమ్మెల్యే వాపోయారు. ఆదిలాబాద్ రోడ్ ఘాట్ సెక్షన్ మార్గంలో డబుల్ రోడ్ నిర్మించాల్సిన అవసరం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో బ్రిడ్జిలు లేక ప్రజలు వరదల్లో ఇబ్బందులు పడుతున్నా పాలకులు స్పందించడం లేదని మండిపడ్డారు.

## నిధుల కేటాయింపుపై డిమాండ్

వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించడానికి నిధులు లేవని ఆమె తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలకు ఇచ్చే సీడీపీ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు విన్నప్పుడు నోట్ చేసుకుంటున్నామని చెబుతున్న ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదని కోవ లక్ష్మి ఆరోపించారు. కొండలు, గుట్టల ప్రాంతాల్లో నివసించే ప్రజల కష్టాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు.

# మల్కాపూర్‌లో ప్లాట్ కొనాలంటేనే భయం

- బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు
- అనుమతులు ఉన్నా తప్పని ఇబ్బందులు
- భూ వివాదాలతో కొనుగోలుదారులపై ఒత్తిడి
- అధికారుల జోక్యం కోరుతున్న బాధితులు
- రియల్ ఎస్టేట్ రంగంలో పెరుగుతున్న అనిశ్చితి




**కొండాపూర్, మార్చి 18 (జనం పవర్):**

సంగారెడ్డి పట్టణానికి ఆనుకుని వేగంగా అభివృద్ధి చెందుతున్న మల్కాపూర్ గ్రామం ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగంలో హాట్‌స్పాట్‌గా మారింది. కొత్త లేఅవుట్లు, ఆధునిక సదుపాయాలతో ప్లాట్లు మార్కెట్‌లోకి రావడంతో పెట్టుబడిదారులు, మధ్యతరగతి కుటుంబాలు పెద్ద ఎత్తున ఇక్కడ స్థలాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ అభివృద్ధి వెనుక కొనుగోలుదారుల్లో ఆందోళన కలిగించే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. తాజాగా వెలుగులోకి వస్తున్న ఆరోపణలు, సంఘటనలు ప్లాట్ కొనుగోలు దారుల్లో భయాందోళనలకు దారితీస్తున్నాయి.

## అనుమతులు ఉన్నా వేధింపులు

స్థానికుల ఆరోపణల ప్రకారం డీటీసీపీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్న ప్లాట్లు కొనుగోలు చేసినప్పటికీ కొందరు ప్రభావశీలులు వివిధ కారణాలు చూపుతూ కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో నోటీసులు జారీ చేయించడం, భూమి యాజమాన్యంపై వివాదాలు సృష్టించడం లేదా ఇతర రకాల ఒత్తిళ్లు తీసుకురావడం జరుగుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా కూడా ఇబ్బందులు తప్పడం లేదని, డబ్బులు ఇవ్వకపోతే ఏదో ఒక సమస్యను సృష్టిస్తున్నారని పలువురు కొనుగోలుదారులు వాపోతున్నారు.

## పెట్టుబడిపై పెరుగుతున్న అనిశ్చితి


ఇలాంటి పరిణామాల నేపథ్యంలో కొనుగోలుదారుల్లో తమ పెట్టుబడిపై అనిశ్చితి పెరుగుతోంది. ముఖ్యంగా జీవిత పొదుపులు పెట్టి స్థలం కొనుగోలు చేసిన కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతమంది అయితే నోటీసుల భయం, వివాదాల భయం వల్ల తమ ఆస్తులను తక్కువ ధరలకు అమ్ముకునే పరిస్థితికి చేరుతున్నారని సమాచారం. సరైన అనుమతులు ఉన్న లేఅవుట్లలో కూడా ఇలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి చట్టపరమైన రక్షణ పొందాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. భూమి రికార్డులు పూర్తిగా పరిశీలించుకోవాలని, లేఅవుట్ అనుమతులు ధృవీకరించుకోవాలని, రిజిస్ట్రేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో చూడాలని వారు పేర్కొంటున్నారు.

## అధికారుల జోక్యం అత్యవసరం

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలుదారులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మల్కాపూర్‌లో కొనసాగుతున్న ఈ పరిస్థితులు రియల్ ఎస్టేట్ రంగంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

# చిరుత? పులా!?

## కవ్వాల్ టైగర్ జోన్‌లో వన్యప్రాణి మృతి..





**అధికారుల తీరుపై ప్రజాగ్రహం**

**వేటగాళ్ల ఉచ్చుకు బలైపోయిన మూగజీవం..**

**గోళ్లు పీకేసిన దుండగులు**

**పులిని చిరుతగా చిత్రీకరిస్తున్నారని నిప్పులు చెరుగుతున్న ప్రజా సంఘాలు**

**తుడుం జితేందర్ - జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

వన్యప్రాణుల రక్షణ నిలయంగా పేరొందిన కవ్వాల్ టైగర్ జోన్ ఇప్పుడు మూగజీవాల పాలిట మృత్యుకూపంగా మారుతోంది. దండేపల్లి మండలం తాళ్లపేట అటవీ పరిధిలో జరిగిన ఘటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. చంపబడింది చిరుత కాదు పులేనని స్థానిక ప్రజలు, కుల సంఘాలు గర్జిస్తున్నారు. అధికారులు మాత్రం దీనిని చిరుత అని సరిపెట్టే ప్రయత్నం చేయడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

## వేటగాళ్ల కర్కశత్వం - నిఘా వైఫల్యం

నిందితులు క్లచ్ వైర్లతో అమర్చిన ఉచ్చులో చిక్కుకుని ఒక వన్యప్రాణి బలైపోయింది. ఊట్ల, పాతమామిడిపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు అటవీ చట్టాలను తుంగలో తొక్కి ఆ జీవి ప్రాణం తీశారు. విక్రయించేందుకు దాని గోళ్లను కూడా పీకేశారు. నాలుగు రోజుల పాటు మృతదేహం అడవిలోనే కుళ్ళిపోతున్నా అధికారులకు తెలియలేదంటే ఇక డ్రోన్లు, సీసీ కెమెరాలు ఎందుకు అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కోట్లాది రూపాయల బడ్జెట్ ఏం చేస్తున్నారని నిలదీస్తున్నారు.

## అటవీ శాఖపై పెరుగుతున్న అనుమానాలు

గతంలో ఇదే ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అధికారులే నిఘా కెమెరా ఆధారాలతో ప్రజలను హెచ్చరించారు. ఇప్పుడు మరణించిన తర్వాత దానిని చిరుతగా ముద్ర వేయడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటని స్థానికులు అడుగుతున్నారు. ల్యాబ్ రిపోర్టులను ఎందుకు బయటపెట్టడం లేదని, స్వాధీనం చేసుకున్న అవయవాలను మీడియా ముందు ఎందుకు ప్రదర్శించలేదని ప్రశ్నిస్తున్నారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్లనే వేటగాళ్లు రెచ్చిపోతున్నారని విమర్శలు వస్తున్నాయి.

## ఉద్యమానికి సిద్ధమవుతున్న సంఘాలు

విధుల్లో నిర్లక్ష్యం వహించిన బీట్ ఆఫీసర్ నుండి ఉన్నతాధికారుల వరకు అందరినీ వెంటనే సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ల్యాబ్ రిపోర్టులను బహిర్గతం చేసి వాస్తవాలు వెల్లడించాలని కోరుతున్నారు. అడవిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా, స్మగ్లింగ్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే కవ్వాల్ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు. అడవిని కాపాడాల్సిన వారే నిద్రపోతే మూగజీవాలకు దిక్కెవరు అని ప్రశ్నిస్తున్నారు.

# సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకలు

- చిన్నారుల విద్యా ప్రయాణానికి పునాది ప్రారంభ విద్యా దశ
- పట్టాలు అందుకున్న సీనియర్ కేజీ విద్యార్థులు



**సంగారెడ్డి, మార్చి 18 (జనం పవర్):**

బాల్య దశలోనే విద్యతో పాటు పోషకాహారం, విలువల పెంపకం, సామాజిక నైపుణ్యాల అభివృద్ధి అత్యంత కీలకమని నిపుణులు పేర్కొన్నారు. ఈ దిశగా చిన్నారుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ కేజీ విద్యను పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ ధ్రువీకరణ పత్రాలు అందజేసి వారి ప్రతిభను అభినందించారు. చిన్నారుల భవిష్యత్తు విద్యా ప్రయాణానికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కూన వేణుగోపాలకృష్ణ విచ్చేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ ఈ. విజయ్ కుమార్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ. అరుణ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కీ శెట్టి, డైరెక్టర్ వరలక్ష్మి, అకాడమీ అడ్వైజర్ చందన పాల్గొన్నారు. వీరంతా సరస్వతీ దేవి చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారి యు. నిహాశ్వీ స్వాగత నృత్యంతో అతిథులను ఆహ్వానించడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ అనుభవాలను చిన్న ప్రసంగాల రూపంలో పంచుకున్నారు. ప్రీ ప్రైమరీ దశలో పిల్లలు సాధించిన నైపుణ్యాలు వారి భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రైమరీ విద్యలోకి అడుగుపెట్టబోతున్న చిన్నారులు మరింత కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయాల వెనుక ఉన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఈ. సోలోమోన్ రెడ్డి పర్యవేక్షణలో, వారి ఆశీస్సులతో విజయవంతంగా కొనసాగింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



